RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 247 పేజీలు - 08 ఆదివారం 02 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

### భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి

# కొత్త రన్‌వే

- స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి కీలకమైన రోజు
- నూతన ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయి
- చంద్రబాబు విజన్‌తో ఎపి అభివృద్ధిలో పరుగెడుతోంది
- 12 ఏళ్లలో దేశంలో కొత్తగా 166 విమానాశ్రయాలు నిర్మించాం
- విమానం ఎక్కాలన్న పేదల కల సాకారం చేస్తున్నాం
- భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభించిన మోడీ
- పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ శ్రీకారం






**తొలి అక్షరం/విజయనగరం,ఆగస్టు 1:** స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి నేడు కీలకమైన రోజు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రూ.18 వేల కోట్లతో శనివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయని ఆయన చెప్పుకొచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. 'ఈ నూతన ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయ న్నారు. కొత్త ప్రాజెక్టులు ఎయిర్, రోడ్ కనెక్టివిటీని పెంపొందిస్తాయి. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు చేస్తున్నా. మిగతా2లో...

# నల్ల చెరువు పునరుజ్జీవంలో హైడ్రా అహర్నిశలు కృషి

### అత్యుత్తమ పనితీరును ప్రదర్శిస్తోన్న రాష్ట్రం..సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 1:** ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి హైడ్రా అహర్నిశలు శ్రమించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులకు, సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈమేరకు శనివారం ట్వీట్ చేశారు. చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న హైదరాబాద్‌ను చూడటం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. క్యూర్ పరిధిని క్యూర్ చేసుకుంటూ... మన చెరువులకు జీవం పోస్తూ... జీవంతో నిండిన భవిష్యత్తును భావి తరాలకు హైడ్రా అంకితం చేస్తోందని తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదనీ, భావి తరాల భవిష్యత్తును భద్రపరచడం కూడా అని పేర్కొన్నారు. ప్రతి చెరువును కాపాడుతూ... ప్రజల ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామని ఆయన భరోసా ఇచ్చారు. కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న తెలంగాణరాష్ట్రంలో తమ పార్టీ మిగతా2లో...

## గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

- నీళ్లు మళ్లించే ఎపి కుట్రలు వేగమయ్యాయి
- టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపణ


2లో

# సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

### వాట్సాప్ అంకుల్స్ వర్సెస్ ఇన్‌స్టాగ్రామ్ పిల్లలకు మధ్య పోరాటం..

### బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 1:** యువతరం కొత్త తరహాలో దిల్లీలో కదం తొక్కిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రధాని మోదీ ఎవరితో పెట్టుకోవద్దో వారితోనే పెట్టుకున్నారని చెప్పారు. వాట్సాప్ అంకుల్స్.. ఇన్‌స్టా పిల్లల్లో ఎవరు గెలిచారో చూశాం. అర్ధరాత్రి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్టు చేశారు. సోషల్ మీడియా లేకపోతే జవాబుదారీతనం వచ్చేది కాదు. వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్‌జీలు ఓట్లు వేయబోతున్నారు. 18 నుంచి 24 ఏళ్ల మధ్య పిల్లలు పేపర్లు, టీవీలు మిగతా2లో...



# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

- అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ
- కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 1:** ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణి నుంచి భూభారతి వరకు లావాదేవీలపై విచారణ జరుపుతున్నట్లు మిగతా2లో...

### ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ

# రాష్ట్రానికే గర్వకారణం

- గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉత్తమ్ పర్యటన
- పూడికతీత పనులను అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 1:** తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ (ఎస్సారె-స్పీ) ప్రాజెక్టును సందర్శించి, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల పరిస్థితులను సమీక్షించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, సుమారు 56 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు జీవనాడిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లో పూడిక వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుండడాన్ని గుర్తించి, ప్రాజెక్ట్ పూడికతీతకు సంబంధించి ప్రత్యేక మిగతా2లో...

## భద్రాచలం వల్ల నిలకడగా గోదావరి

- 56 అడుగులకు చేరిన నీటిమట్టం
- భద్రాచలం చుట్టుపక్కల చేరిన వరదనీరు
- అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి తుమ్మల


2లో

### ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన

# మీసేవ లావాదేవీలు

● తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు ● దేశంలోనే నెంబర్ వన్‌గా మీసేవ ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్ ● మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 1:** ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆ÷-లనైన్ లో ఒకే వేదిక మీద అందిస్తోన్న మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. శుక్రవారం ఒక్క రోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒకే రోజు రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు జరిగాయని ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. మీసేవ డిజిటల్ ఎ÷-లాట్ ఫామ్ ను మరింతగా అభివృద్ధి చేయటం, సేవలను విస్తృత పరచటం, ఆమేరకు ప్రజల వాడకాన్ని ప్రోత్సహించటంలో ప్రజాప్రభుత్వం చొరవచూపిస్తోంది. దీంతో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. రాష్ట్ర పౌరులకు వేగంగా, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలను అందించేందుకు మిగతా2లో...




## రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ

### విద్వేషపూరిత ప్రసంగాలపై అసెంబ్లీలో బిల్లు: పొన్నం

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 1:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్లో సెలక్ట్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సెలక్ట్ కమిటీ చైర్మన్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చించింది. మిగతా2లో...

# భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే

(మొదటి పేజీ తరువాయి)

13 వేల మంది గిరిజన మహిళల నృత్యం అద్భుతంగా ఉంది. అభివృద్ధితోపాటు థింసా నృత్యంలోనూ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇది చంద్రబాబు విజన్‌కు మరో సాక్ష్యం' అని పేర్కొన్నారు. విమానాశ్రయాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసాను చూసి మధురానుభూతికి లోనయ్యా. అభివృద్ధిలో రికార్డులతో పాటు థింసా నృత్యం కూడా రికార్డు సృష్టించింది. ఒకేసారి 13వేల మంది గిరిజన మహిళల నృత్యం నిజంగా అద్భుతం. చంద్రబాబు విజన్‌కు హృదయపూర్వక అభినందనలు. భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా పనిచేస్తుంది. ఈ ఎయిర్‌పోర్టు.. ఆంధ్రా యువత ఉజ్వల భవిష్యత్తుకు కొత్త లాంచ్‌పాడ్‌లా పనిచేస్తుంది. గతంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒక్క కుటుంబం పేర్లే ఉండేవి. అయోధ్యలో ఎయిర్‌పోర్టుకు వాల్మీకి పేరు, పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరు పెట్టాం. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. 2014కు ముందు మన దేశంలో 74 విమానాశ్రయాలే ఉండేవి. మేం వచ్చాక 12 ఏళ్లలో 166 విమానాశ్రయాలు వచ్చాయి. సామాన్యులకు కూడా విమాన ప్రయాణాన్ని చేరువ చేశాం. విమానం ఎక్కాలన్న పేద, మధ్యతరగతి కలలు సాకారం చేశాం. తమ ప్రాంతం నుంచే విమానం ఎక్కేలా కొత్త అనుభూతి తీసుకొస్తు?న్నాం. ఉడాన్ ద్వారా దేశ విమానయానరంగంలో పెనుమార్పులు వచ్చాయి.దేశంలో బ్లూ ఎకానమీ అభివృద్ధి చేస్తున్నాం. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు పాత పోర్టులు అభివృద్ధి చేస్తున్నాం. మూలపేట,



రామాయపట్నంలో కొత్త పోర్టులు నిర్మిస్తున్నాం. పోర్టుల అభివృద్ధితో పాటు హైవే ఎక్స్‌ప్రెస్‌లు సరికొత్త వేగాన్ని అందిస్తున్నాయి. ఏపీలో రూ.లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. ఈ రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ భవిష్యత్తు వైపు చూస్తారు. సాఫ్ట్‌వేర్, ఐటీ సెక్టార్‌లో తెలుగువాళ్లకు మంచి పేరుంది. దేశ, విదేశాల్లో తెలుగువాళ్లు తమ సత్తా చాటుతున్నారు. ప్రతిభావం తులైన యువత సామర్థ్యం దేశానికి ఉపయోగపడాలి. చంద్రబాబు సారథ్యంలో మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఏపీ మారుతోంది. ప్రపంచంలో అనేక ప్రముఖ కంపెనీల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి. ఏపీలో గ్రోత్ ఎకో సిస్టం నిర్మిస్తున్నాం. సెమీకండక్టర్, డేటా సెంటర్ రంగాల్లో వేగంగా పనులు జరుగుతున్నాయి. కేంద్రం.. నక్కపల్లిలో భారీ ఫార్మా కంపెనీ నిర్మిస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే డబుల్ స్పీడ్‌తో ఏపీ అభివృద్ధి' అని మోదీ తెలిపారు. అనంతరం పలు ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. రూ.17,912 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.4,727 కోట్లతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మించారు. విశాఖపట్నం తర్లువాడలో సెమీకండక్టర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సెమీకండక్టర్ ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్ తొలిదశకు శ్రీకారం చుట్టారు. రూ.468 కోట్ల వ్యయంతో సెమీకండక్టర్ ప్రాజెక్టును ప్రారంభిం చారు. కర్నూలు జిల్లాలో 4 రెన్యువబుల్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రూ.5,550 కోట్ల వ్యయంతో పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. కర్నూలు విండ్, సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ ప్రారంభించారు. రూ.3,547 కోట్ల వ్యయంతో కర్నూలు ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు, అనంతపురం, కర్నూలులో రూ.823 కోట్ల వ్యయంతో.. చేపట్టిన సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ పథకం ప్రారంభిం చారు. రూ.27 కోట్లతో పెంచలకోన- ఎర్రపాడు హైలె వల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. రూ.763 కోట్లతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్యాకేజీ-4, రూ.933 కోట్లతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్యాకేజీ-5 ప్రారంభించారు. రూ.160 కోట్లతో తాడిపత్రి 4 లేన్ బైపాస్ నిర్మాణానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. పేదల భూములను కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదన్నారు. మరోవైపు భూముల ధరల సవరణతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం వరకు పెరిగిందని పొంగులేటి తెలిపారు. సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్దిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ౧÷నైల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## భద్రాచలం వల్ల నిలకడగా గోదావరి

**తొలి అక్షరం/భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు 1:** భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా ఉంది. శనివారం ఉదయం 11 గంటల నుంచి 56 అడుగుల వద్ద నిలకడగా ప్రవహిస్తోంది. నీటిమట్టం పెరగడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. నీటిమట్టం స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు భద్రాచలం చుట్టుపక్కల ప్రాంతాల్లోని రహదారుల పైకి వరద నీరు చేరాయి. దీంతో భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వాజేడు, వెంకటాపురం, వి.ఆర్ పురం, వేలేరుపాడు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదలతో భద్రాద్రి కొత్తగూడెం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. గోదావరి నీటిమట్టం 55.90 అడుగులకు చేరింది. దాదాపు 15,84,657 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం గోదావరి వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. మరోవైపు భద్రాచలం గోదావరి వరదలపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్‌లో మాట్లాడారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రాచలంలోకి వరద నీరు రాకుండా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గోదావరి వరదలపై ఉన్నతాధికారుల తో ఎప్పటికప్పుడు పరిస్థితిని మంత్రి సమీక్షించారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఇకపోతే భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చి, రెండు రోజుల వ్యవధిలోనే సుమారు 50 అడుగులు దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి 53 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం శనివారం ఉదయానికి 55.1 అడుగులకు పెరిగింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. భద్రాచలం-వెంకటాపురం మార్గంలో రహదారిపైకి వరద నీరు చేరింది. దీంతో భద్రాద్రి ఏజెన్సీలోని వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

# ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

(మొదటి పేజీ తరువాయి)

మీసేవ వేదికను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక్క రోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అవాంతరాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆ÷-లనైన్ ఎ÷-లాట్ ఫార్మ్ గా మీ సేవ నిలిచిందని మంత్రి అన్నారు. రోజు సరాసరి 70 నుంచి 80 వేల కార్యకలాపాలు మీసేవ ద్వారా నమోదవుతాయి. శుక్రవారం ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. వీటిల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ కార్డు, రవాణాశాఖ, ఆదాయ ధృవీకరణ పత్రాల అప్లికేషన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఘనత తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని మంత్రి ప్రకటించారు. పనితీరును మెరుగుపరచడం, సేవల లభ్యతను విస్తరించడం, కొత్త పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతిక, మౌలిక వసతులను బలోపేతం చేయడం లాంటి చర్యల ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు సేవలను అందించడంలో విశేష కృషి చేసిన నిర్వాహకులు, సాంకేతిక బృందాలను మంత్రి అభినందించారు. మీసేవ ద్వారా ప్రస్తుతం ఫ్యామిలీ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, వివిధ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ యుటిలిటీ చెల్లింపులు, అలాగే పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉన్నాయి. అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడం, ఆధునిక సాంకేతికతను వినియోగించడం, సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను మరింత మెరుగుపరచడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## నల్ల చెరువు పునరుజ్జీవంలో హైడ్రా అహర్నిశలు కృషి

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ కొత్త శిఖరాలను అధిరోహిస్తూ సరికొత్త విజయాలను సాధిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ పని తీరును ప్రదర్శిస్తోందని ట్వీట్ ద్వారా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో తలసరి ఆదాయం రూ. 4,18,931గా నమోదయ్యిందనీ, ఇది గతేడాది రూ. 3,80,031గా ఉందని గుర్తు చేశారు. ఒకే సంవత్సరంలో తాము 10.23 శాతం వృద్ధిని సాధించామనీ, ఇది రూ. 38,900 పెరుగుదల అని తెలిపారు. కఠోర శ్రమ, ఆర్థిక వృద్ధిపై దృష్టి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, అన్ని రంగాలలో సమతుల్య అభివృద్ధి, తాత్కాలిక విధానాల నుంచి విధాన ఆధారిత పాలనకు మారడం, శ్రద్ధతో కూడిన పని, నిరంతర సమీక్షలు, వివరాలపై శ్రద్ధ, భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు చేయడం ద్వారా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం... గత దశాబ్దకాలపు వైఫల్య పాలనను, నిరాశావాద వాతావరణాన్ని తిప్పికొట్టి, ప్రతి పౌరునిలో ఆశావాదాన్ని, నమ్మకాన్ని నింపిందని వివరించారు. తమ విజయానికి మహిళలు, రైతులు, యువత అతిపెద్ద లబ్దిదారులని తెలిపారు. రాబోయే కాలంలో రాష్ట్రం మరింత గొప్ప విజయాలను సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 1:** గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తోందని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను అడ్డుకునేలా ఎత్తుగడలు వేస్తోందని విమర్శించారు. తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో గోదావరి జలాలను మళ్లించే కుట్రలు వేగవంతమయ్యాయని ఆరోపించారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను ప్రశ్నిస్తూ ఫిర్యాదులు చేయడం ద్వారా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) కూడా ఆంధప్రదేశ్ వైఖరికి అనుగుణంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోదావరి నదిలో తెలంగాణకు 964 టీఎంసీల జలాలపై హక్కు ఉందని, ట్రిబ్యునల్ రక్షణ కలిగిన కేటాయింపులు చెల్లవని పేర్కొంటూ తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధప్రదేశ్ కోరడం తెలంగాణ హక్కులను కాలరాయడమేనని కవిత అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి గోదావరి జలాల విషయంలో ఆంధప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వకుండా, తెలంగాణ ప్రజల హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

(మొదటి పేజీ తరువాయి)

చూడటం లేదు. నేటి యువత న్యూస్‌ను రీల్స్ రూపంలో చూస్తోందని కేటీఆర్ అన్నారు.తెలంగాణలోనే ఎన్నో సందర్భాల్లో వార్తను వార్తలా రాయలేని పరిస్థితి లేదా..? ఒక అమ్మాయి మీద లైంగిక దాడి జరిగింది.. కేంద్ర మంత్రి కుమారుడు ఈ దుర్మార్గమైన పని చేశాడని ఆ అమ్మాయి తల్లీదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తే వారం రోజులు ఏ మీడియా రిపోర్ట్ చేసింది..? సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం ? ప్రజాస్వామ్యం ? పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. లగచర్లలో గిరిజనుల మీద అకృత్యాలు జరిగితే ఏ మీడియా రాసింది.. నేను ఈ మాట అంటున్నందుకు దయచేసి ఎవరూ ఏం అనుకోవద్దు.. వాస్తవాలు చెబితే చేదుగానే ఉంటాయి. ఈ రోజున్న పరిస్థితుల్లో డైరెక్టుగా శాసనసభలో, బయట ప్రభుత్వంలో ఉన్న పెద్దలు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేస్తే కూడా ఏ మీడియా ప్రశ్నించింది.. ? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి విషయంలో విద్యార్థులు కదం తొక్కే దాకా ఏ మీడియా రాసింది..?ఎక్కడుంది పరిశోధనాత్మక జర్నలిజం.. ఉందా..? నేను ఈ మాట అంటే మీలో చాలా మందికి మళ్లీ నాలో అహంకారం కనబడొచ్చు. నేను ఉన్నది ఉన్నట్టుగా అడుగుతున్నా.. ఉన్నదా రాసే పరిస్థితి.. చెప్పే పరిస్థితి ఉన్నదా..? అందరి ముందటే అడుగుతున్నా స్వేచ్ఛగా, నిర్భీతిగా పరిశోధనాత్మక కథనాలు వస్తున్నాయా..? వాస్తవాలు చెబితే నచ్చవన్నారు.

## ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో ప్రాజెక్ట్ నుండి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు. అయితే, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు కొంత తక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితిని రైతులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీరు నింపకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. సాంకేతిక లోపాలు, డిజైన్ వైఫల్యాల వల్ల దెబ్బతిన్న ఈ మూడు ప్రాజెక్టుల పునరుద్ధరణ విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న శాస్త్రీయ చర్యలను సెంట్రల్ వాటర్ కమిషన్ కూడా ఏకీభవించిందని వివరించారు. ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమని, అది ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగమని స్పష్టం చేసిన మంత్రి.. దాన్ని కూడా తామే కట్టినట్లు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్యాములు 60 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, కానీ బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టులు మాత్రం కొద్ది ఏళ్లకే ధ్వంసం అయ్యాయని ఎద్దేవా చేశారు. కేవలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లానే కాకుండా దక్షిణ తెలంగాణ సాగునీటి పరిస్థితులను కూడా ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌కు కూడా ఎగువ నుండి నీళ్లు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని, రైతాంగానికి సాగునీటి కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఓ నివేదికను సమర్పించే దిశగా ఈ కమిటీ కార్యాచరణ రూపొందించనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు పాల్గొన్నారు. మరోసారి హేట్ బిల్, స్పీచ్ బిల్లు కాపీలను సభ్యులందరికీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ ఇచ్చారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. వారం రోజుల్లో మరోసారి తమ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. వచ్చే సమావేశంలో సభ్యులందరీ నుంచి సూచనలను తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా తమ కమిటీ నివేదిక సిద్ధం చేస్తుందని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలతో పాటు సమాజంలో పేరొందిన వారి సలహాలు తీసుకుంటామని అన్నారు. వ్యక్తుల గౌరవం కాపాడే విధంగా తమ కమిటీ నివేదిక ఉంటుందని వివరించారు. భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# స్నేహబంధం వెలకట్టలేనిది

**• తొర్రూర్ వికాస్ హై స్కూల్ కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 1:** స్నేహబంధం వెలకట్టలేనిదని వికాస్ హై స్కూల్ కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ తెలిపారు.మండలంలోని వెలికట్ట శివారు వికాస్ హై స్కూల్లో శనివారం ముందస్తు జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఒకరికొకరు ఫ్రెండ్షిప్ రాఖీలను కట్టుకుని తమ స్నేహబంధాన్ని ఆత్మీయంగా పంచుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని బంధాల లోకెల్లా స్నేహ బంధం గొప్పదని, స్నేహితుల త్యాగనిరతి వెలకట్టలేనిదని తెలిపారు. మనిషి జీవితంలో రక్త సంబంధం కంటే స్నేహబంధం గొప్పదని తెలిపారు. కుల, మత, వర్గ భేదాలు లేని ఏకైక స్వచ్ఛమైన బంధం స్నేహమేనని పేర్కొన్నారు. నిజమైన స్నేహితుడు ఆపదలో వెన్నంటి ఉంటాడని, స్నేహితుల ఆనందం కోసం, వారి అభ్యున్నతి కోసం చేసే త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేనివని పేర్కొన్నారు.విద్యార్థి దశలో ఏర్పడే స్నేహాలు ఎంతో స్వచ్ఛమైనవని, అవి జీవితాంతం ఒక తీపి గుర్తుగా నిలిచిపోతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కెవి రెడ్డి,ప్రిన్సిపాల్ బండి నాగరాజు,వైస్ ప్రిన్సిపాల్ వెలిశాల రాజు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంతంగి గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహణ

**- కాకి శ్రీలత సుందర్. పంతంగి గ్రామ సర్పంచ్**



**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగష్టు 01:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం పరిధిలోని పంతంగి గ్రామంలో శనివారం జలసిరి కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం ముందు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్ గ్రామసభను ఉద్దేశించి మాట్లాడుతూ, జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామంలో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామ ప్రజలు సహకరించాలని, నీటి వనరుల పరిరక్షణ ద్వారా భావితరాలకు మెరుగైన భవిష్యత్తు అందించవచ్చని ఆమె పేర్కొన్నారు.ఈ గ్రామసభలో గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, మహిళలు, యువత మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దుష్ప్రచారం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టునే నేడు ఆశ్రయించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- ఢిల్లీ మాధవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, చౌటుప్పల్ మండలం**



**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగష్టు 01:** కాళేశ్వరం ప్రాజెక్టుపై గతంలో "కూలిపోయింది", "వృథా ప్రాజెక్టు" అంటూ కాంగ్రెస్ పార్టీ చేసిన విమర్శలు నేడు అసత్యమని తేలిపోయాయని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి అన్నారు.ఆయన మాట్లాడుతూ, గతంలో కాళేశ్వరం రివర్స్ పంపింగ్ విధానాన్ని విమర్శించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేస్తూ ఎస్ఆర్ఎస్పీ వరద కాలువలోని రాంపూర్ పంప్‌హౌస్ మోటార్లను ప్రారంభించి గోదావరి జలాలను ఎత్తిపోస్తోందని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు పంప్‌హౌస్‌ల ద్వారా గోదావరి జలాలను ఎస్ఆర్ఎస్పీ వరద కాలువకు రివర్స్ పంపింగ్ చేయడం వల్ల సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతున్న విషయం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. గతంలో ఈ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేసిన వారు, నేడు అదే ప్రాజెక్టుపై ఆధారపడటం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలుస్తోందని, రాజకీయ విమర్శలకు అతీతంగా రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఢిల్లీ మాధవరెడ్డి పేర్కొన్నారు.

# ఐటీఐ, ఏటీసీ విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ & ప్లేస్‌మెంట్ జాబ్ మేళా....ప్రిన్సిపాల్ సక్రు

**ఆగస్టు 6న ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ, టేకులపల్లిలో నిర్వహణ**

**ఖమ్మం, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యం**

**అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 1:** ప్రభుత్వ ఐటీఐ/అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), టేకులపల్లి, ఖమ్మం ఆధ్వర్యంలో ఐటీఐ, ఏటీసీ విద్యార్థుల కోసం 100 శాతం అప్రెంటిస్‌షిప్ & ప్లేస్‌మెంట్ జాబ్ మేళాను ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ, టేకులపల్లి ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ ప్రిన్సిపాల్ జి. సక్రు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళాలో ఖమ్మం, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పరిశ్రమలు పాల్గొని అర్హులైన అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్‌తో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించ నున్నట్లు తెలిపారు. ఐటీఐ, ఏటీసీలో అర్హత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం అప్రెంటిస్‌షిప్ అడ్వైజర్ జి. రవి (టి.ఓ.), ఖమ్మంను 9989637594 నంబర్‌లో సంప్రదించాలని ఆ ప్రకటనలో సూచించారు.

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను వెలికి తీయాలి







**• తొర్రూర్ఆర్యభట్ట స్కూల్ చైర్మన్ మధుకర్ రెడ్డి**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 1:** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను వెలికి తీసి వారిని బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని తొర్రూరు ఆర్యభట్ట స్కూల్ చైర్మన్ నెలకుర్తి మధుకర్ రెడ్డి అన్నారు. శనివారం తొర్రూరు పట్టణంలోని ఆర్యభట్ట సీబీఎస్సీ స్కూల్లోవిద్యార్థుల్లో సృజనాత్మకత, సాంస్కృతిక విలువలు, నాయకత్వ లక్షణాలు మరియు ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో మెహందీ కార్యక్రమం మరియు స్కూల్ కాబినెట్ ఎన్నికలు ఘనంగా నిర్వహించారు.మెహందీ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని అందమైన మెహందీ డిజైన్లతో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.అనంతరం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచన, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు స్కూల్ కాబినెట్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులు క్రమశిక్షణతో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించి విద్యార్థి నాయకులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమాలకు పాఠశాల చైర్మన్ నెలకుర్తి మధుకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ నైపుణ్యాలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనను అలవర్చుకోవాలని సూచించారు.. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ సామర్థ్యం, సేవాభావం, ప్రజాస్వామ్య విలువలు మరియు జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయుల ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తొర్రూర్ బేడ (బుడగ) జంగాలు







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 1:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణానికి చెందిన బేడ (బుడగ) జంగాల భక్తులు శనివారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని, శ్రీ పద్మావతి అమ్మవారిని అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.తుర్పాటి శివగోపాల్ సీనియర్ జర్నలిస్ట్ పస్తం సాంబ ,ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తిరుమల యాత్రలో తొర్రూర్ పట్టణానికి చెందిన పలు కుటుంబాలు విశేషంగా పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపాకటాక్షాలు పొందారు.ఈ సందర్భంగా తుర్పాటి శివగోపాల్ సీనియర్ జర్నలిస్ట్ పస్తం సాంబ,మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడటానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఇలా బృందాలుగా టీమ్‌లుగా ఏర్పడి ప్రముఖ దేవాలయాలను దర్శించుకోవడం ద్వారా మన భక్తిభావాన్ని చాటుకోవడమే కాకుండా, మన పిల్లలకు మన సంస్కృతి, హిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని అందించినవాళ్లమవుతాం. ప్రతి ఒక్కరూ ఒక బృందంగా ఏర్పడి ధార్మిక యాత్రలు చేపట్టాలి.ఈ ఆధ్యాత్మిక యాత్రలో పలువురు భక్తులు కుటుంబసమేతంగా పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. యాత్రలో పాల్గొన్నారు తూర్పాటి చంద్రమ్మ,పస్తం సాంబ లక్ష్మి,తూర్పాటి పున్నం వెంకన్న పద్మ దంపతులు, నర్కుటి పరశురాం పద్మ దంపతులు, తుర్పాటి మదర్ రమణ దంపతులు, తూర్పాటి శీను, తూర్పాటి సంజీవ సాయి స్వప్న దంపతులు.తూర్పాటి జ్యోతి, కిన్నెర కుమారఅమ్మ, నర్కుటి ఉపేంద్ర, తూర్పాటి సాయి కృష్ణ, తూర్పాటి శ్యామ్, తూర్పాటి ప్రణయ్, తూర్పాటి కార్తీక్, పస్తం మనోజ్, నర్కుటి ప్రశాంత్, నర్కుటి పవన్ కుమార్ పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రీ జూనియర్ కళాశాలలో ఘనంగా గోరింటాకు సంబరాలు



**ముఖ్య అతిథిగా కళాశాల చైర్మెన్ బండారు మయూర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు**



**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగష్టు 1:** చౌటుప్పల్‌లోని శ్రీ గాయత్రీ జూనియర్ కళాశాలలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని విద్యార్థినుల కోసం గోరింటాకు సంబరాలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని చేతులకు అందమైన గోరింటాకు అలంకరించుకుని తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించారు. దీంతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ఛైర్మన్ శ్రీ బండారు మయూర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, అధ్యాపకులకు శ్రావణ మాస శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం కళాశాల కరస్పాండెంట్ శ్రీ భీమిడి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ, గోరింటాకు మన తెలుగు సంస్కృతికి ప్రతీక అని, ఇది ఆనందం, శుభం, సాంప్రదాయ విలువలకు చిహ్నమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని ఆచరించాలని సూచించారు. శ్రావణ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వెనుక శాస్త్రీయ, ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే కొన్ని చర్మ సమస్యల నుంచి రక్షణ కల్పించడంలో ఇది ఉపయోగపడుతుందని వివరించారు.ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఐక్యత, సాంస్కృతిక విలువలను పెంపొందించడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని తెలిపారు. అందుకే తమ కళాశాలలో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని పేర్కొంటూ, విద్యార్థుల జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, విజయాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కళాశాలను పూలతో అందంగా అలంకరించారు. విద్యార్థినులు ఒకరికొకరు చేతులకు ఆకర్షణీయమైన గోరింటాకు డిజైన్లు వేస్తూ సందడి చేశారు. ఆటలు, పాటలు, నృత్యాలతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థుల కోసం క్రికెట్ పోటీలను కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మారగోని దయాకర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.



# సదరంయూడీఐడీ కార్డుల జారీని వేగవంతం చేయాలి...

**అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరంయూడీఐడీ కార్డులు అందేలా చర్యలు**

**సదరంయూడీఐడీ కార్డుల జారీపై సెర్ప్ సీఈఓ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**


**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 1:** అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం యూడీఐడీ కార్డులు సకాలంలో అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సెర్ప్ సీఈఓ దివ్య సదరం యూడీఐడీ కార్డుల జారీ పురోగతిపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, ముఖ్య వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్



డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. సదరంయూడీఐడీ కార్డుల జారీ పురోగతి, జిల్లాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులు, పెండింగ్ కేసులు, కేంద్రాల పనితీరు, మౌళిక వసతులపై సెర్ప్ సీఈఓ వీసీ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లాకలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం సదరం యూడీఐడీ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులలో అర్హులైన వారందరికీ సదరం ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం యూడీఐడీ కార్డులు అందేలా క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని సూచించారు. జిల్లాలో యూడీఐడీ మూల్యాంకన కేంద్రంలో అవసరమైన పరికరాలు, స్పెషలిస్ట్ వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన సదరం కేంద్రం వల్ల ప్రక్రియ మరింత క్రమబద్ధీకరించ బడిందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సకాలంలో సదరం యూడీఐడీ ధృవ పత్రాలు జారీకి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్డిఓ శ్రీరామ్, సిపిఓ శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానంలో 21వ బోనాల ఉత్సవాలు ఘనారంభం

**• అఖండ దీపారాధన, గణపతి పూజ, అన్నదాన కార్యక్రమాలతో భక్తిశ్రద్ధల మధ్య తొలి రోజు వేడుకలు**





**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగస్టు 1:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానంలో 21వ బోనాల ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు అఖండ దీపారాధన, గణపతి పూజ, అన్నదాన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీ కె. భాస్కర్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలందించే అంశాలపై ఆలయ నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సల్వాది మోహన్ బాబు, కంచర్ల అశ్విన్ రెడ్డి మాట్లాడుతూ, బోనాల ఉత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం దేవస్థానం వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం, క్యూలైన్లు, విశ్రాంతి తదితర సౌకర్యాలను సమకూర్చి నట్లు తెలిపారు. దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని దాతలు కొమిరిశెట్టి విజయ్ కుమార్ శిరీష దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఈడుదుల బాబు, బేతాళ నరసింహ, సిద్ధిపేట ఆనంద్ రెడ్డి, వెంకిర్యాల శివ, బాలగోని శ్రీకాంత్ గౌడ్, బొంతల యువరాజ్, మన్నే మహేందర్ రెడ్డి, దౌడి రాజేష్, పన్నాల మహేందర్ రెడ్డి, ధేప రాజీవ్, పంతంగి రమేష్, జొన్నగంటి దాసు, చిట్టెంపల్లి సబిత, వల్లూరి శివప్రసాద్ శర్మతో పాటు గ్రామ ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.


# అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో మూడు రోజుల ప్రత్యేక ఉచిత యూరాలజీ క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలి

**• ప్రముఖ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. జి మోహన్ చంద్ • అత్యాధునిక పరీక్షలు, నిపుణుల వైద్య సేవలు**

**పెద్దవంగర ఆగస్టు 1తొలి అక్షరం :** మూత్రం సమయంలో మంట, తరచుగా మూత్రం రావటం, మూత్రంలో రక్తం కనిపించడం, కిడ్నీ/ వెన్ను నొప్పి, కిడ్నీలో రాళ్లు, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు, ప్రోస్టేట్ గ్రంధి పెరుగుదల సమస్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట, వరంగల్ ఆధ్వర్యంలో ఈ నెల 03, 04, 05 తేదీల్లో ప్రత్యేక యూరాలజీ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. ఈ క్యాంప్‌లో ప్రముఖ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. జి మోహన్ చంద్ రోగులను ప్రత్యక్షంగా పరీక్షించి, వ్యాధి తీవ్రతను అంచనా వేసి అవసరమైన చికిత్సపై సమగ్ర సలహాలు అందించనున్నారు. క్యాంప్ సందర్భంగా కంప్లీట్ బ్లడ్



కౌంట్, షుగర్ పరీక్ష, కంప్లీట్ మూత్ర పరీక్ష, క్రియాటినిన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ వైద్యుల సలహా మేరకు అందించబడతాయి. అంతేకాకుండా ఇతర ఇన్వెస్టిగేషన్స్ పైన 50 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు కూడా అందుబాటులో ఉంటుందని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ క్యాంప్ ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుంది. కిడ్నీ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం ద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రజలు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకుని ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం తెలియచేయడం జరిగింది స్థలం: అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట క్రాస్ రోడ్, అరేపల్లి, వరంగల్ 506006. అపాయింట్‌మెంట్ వివరాలకు: 94598 75555.



# రైతులు వర్షబావ సందర్భంగా ఆరు తడి పంటలు వేసుకోవాలి: ఎఓ స్వామి నాయక్



**పెద్దవంగర ఆగస్టు 1తొలి అక్షరం:** మండలంలో మండల వ్యవసాయ అధికారి గూగులోత్ స్వామి నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి ఎద్దడిని తట్టుకునే ఆరుతడి పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. శనివారం పెద్దవంగర గ్రామంలో వర్షపావ పరిస్థితులు నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు ,పంట మార్పిడి విధానాలపై రైతులకు ఫీల్డ్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో ఆడపదడప కురిసే వర్షాలు ఆరుతడి పంటలకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. అందువల్ల రైతులు కంది, పెసర, మినుము, బొబ్బర్లు జొన్నలు, చిరుధాన్యాలు ,ఆయిల్ ఫామ్ లాంటి నీటి అవసరం తక్కువగా ఉండే పంటలను సాగు చేసుకోవాలని మరియు సకాలంలో చీడపిదలను నివారణ చర్యలు చేసుకోవాలని సూచించారు .తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను, వ్యవసాయ శాఖ సూచనలను అనుసరించాలని తెలిపారు. పంట మార్పిడి ద్వారా భూసారం కాపాడుకోవడంతోపాటు అధిక దిగుబడులతో పాటు ఆదాయం పెరుగుతుందని తెలిపారు రైతులకు ప్రభుత్వ సూచనలు వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలు వర్షభావ పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు సమగ్ర పంట నిర్వహణపై అవగాహన కల్పించడం జరిగింది. రైతులు సస్యరక్షణ చర్యలు స్ప్రే చేసేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అంకిరెడ్డిగూడెంలో జీపీడీపీ ప్రణాళికపై గ్రామసభ నిర్వహణ

**- సూర్వి మల్లేష్ గౌడ్ అంకిరెడ్డి గూడెం గ్రామ సర్పంచ్**


**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగస్టు 1:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ రచ్చబండ వద్ద శనివారం జీపీడీపీ (గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక) సంబంధిత గ్రామసభను సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ జలసిరి కార్యక్రమం, జీపీడీపీ యాక్షన్ ప్లాన్, గత ఆరు నెలల ఆదాయ-వ్యయాల వివరాలు, గ్రామాభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ ఆస్తుల



వివరాలను గ్రామస్థులకు వివరించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, గ్రామ సమస్యలను సమిష్టిగా పరిష్కరించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వలందాస్ మహేష్ గౌడ్, వార్డు సభ్యులు బత్తుల అనుష మహేష్ గౌడ్, పాలెం వెంకటేశం గౌడ్, ముద్ద లింగస్వామి గౌడ్, దొడ్ల అండాలు శెట్టయ్య గౌడ్, దండుగల వెంకటేశం, బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, రాపోలు రేణుక మల్లేశం, చౌటుప్పల్ ఎస్ఐ సుర కృష్ణమల్, గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండు గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఈఓ, ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, మాజీ సర్పంచ్ సుర్వి సత్తయ్య గౌడ్, యాట శంకరయ్య, పర్ని శ్రీధర్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, భీమగోని బాలరాజ్, పర్ని శ్రీనివాస్ రెడ్డి, భీమగోని మల్లేశం గౌడ్, ముద్దం మల్లయ్య గౌడ్, బిక్షమయ్య గౌడ్, ముద్దం నరసింహ గౌడ్, పల్సం అంజయ్య గౌడ్, సుర్వి నరసింహ గౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రంగు మురళికి పితృ యోగం

**- కుటుంబాన్ని పరామర్శించిన ముద్దసాని సురేష్**



**పెద్దవంగర ఆగస్టు 1తొలి అక్షరం:** మండలంలోని కోరిపెల్లి గ్రామంపాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముద్దసాని సురేష్ రంగు మురళి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రంగు మురళి తల్లి రంగు వినోద మరణించిన విషయం తెలుసుకున్న మాజీ అధ్యక్షులు ముద్దసాని సురేష్ వారి భౌతిక దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారుఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటాయని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి పొడిశెట్టి సైదులు. ఎస్టీ సెల్ అధ్యక్షులు సీతారామ్ నాయక్. మాజీ ఎంపీపీ బానోత్ వెంకన్న. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీసు హరిక్రిష్ణ గౌడ్ సర్పంచ్ లు ఉపసర్పంచ్ లు , వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు



# చేనేత చైతన్య మహాసభను జయప్రదం చేయండి

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 1:** ఈనెల 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 5న కరీంనగర్ జగిత్యాల రోడ్డులోని పద్మశాలి భవన్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి చేనేత మహాసభను జయప్రదం చేయాలని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి పెండెం లక్ష్మీనారాయణ, రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు బూరుగు వెంకటేశం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని సిరిపురం గ్రామంలో చేనేత చైతన్య మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలో 17 మంది పద్మశాలి మున్సిపల్ చైర్మన్ లను, కౌన్సిలర్లు కార్పొరేటర్లకు, నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాల అధ్యక్షులను సత్కరించనున్నట్లు వారు తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కమలాకర్, మేయర్ కొనగాని శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్లు గూడూరు శ్రీనివాస్, దూలం వెంకటరమణ, రాజ్యసభ మాజీ ఎంపీ రాపోలు



ఆనంద భాస్కర్, రిటైర్డ్ ఐఏఎస్ పి చిరంజీవిలు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని వారు తెలిపారు. పద్మశాలి ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల అధ్యక్షులు, వృత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాసభను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపోలు రాజశేఖర్, సిరిపురం చేనేత సహకార సంఘం అధ్యక్షులు రాపోలు షణ్ముఖం, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి, సిరిపురం పద్మశాలి సంఘం అధ్యక్షులు జెల్ల శ్రీనివాస్, డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ జెల్ల వెంకటేష్, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు, మాజీ ఎంపీటీసీలు పున్న వెంకటేశం, బడుగు రమేష్, సిల్క్ చేనేత సహకార సంఘం డైరెక్టర్ మహేశ్వరం అశోక్, చేనేత నాయకులు కైరం కొండ నందు, కొంగరి నరసింహ,అశోక్, చిందం ఉమాకాంతంలు ఉన్నారు.

# తల్లిపాల వారోత్సవాలు



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 1:** ప్రపంచతల్లిపాల వారోత్సవాలలోభాగంగా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామం లోనిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నసర్పంచ్ గర్దాస్ విక్రమ్ అనంతరంవాట్లాడుతూ గర్భిణీలు ప్రసవం అయిన అర్ధగంట లోపే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ఎంతో శ్రేష్ఠమైనవి మరియు, జీవితకాలం ఆరోగ్యావంతంగా ఉండేందుకు ధోహధపడతాయాని గర్భిణీ లను ఉద్దేశిస్తూ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో సిపిడిఓ వెంకటరమణ , పంచాయతీ కార్యదర్శి నరేందర్ , సూపర్ వైజర్ సుజాత, పోషణ అభియాన్ అశోక్ , అంగన్వాడీ టీచర్లు, ఆశాలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు

# పల్లపు ముత్తమ్మ మృతి చాలా బాధాకరం: గర్దాస్ విక్రమ్ సర్పంచ్ ఇంద్రపాలనగరం



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 1:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో ప్రమాదవశాత్తు మరణించిన పల్లపు ముత్తమ్మ మృతుదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియచేసినసర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఈ కార్యక్రమంలోవార్డ్ సభ్యులు వరికుప్పల స్వామి,మాజీ ఏఎంసి డైరెక్టర్ మందడి విద్యాసాగర్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బోదాస్ లక్ష్మి నారాయణ, వడ్డెర సంఘము అధ్యక్షులు బోదాస్ సత్యనారాయణ,పల్లపు అశోక్,మాజీ ఏఎంసి డైరెక్టర్ గర్ధాస్ కరుణాకర్, పాలసంఘము చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం, నక్క వెంకటేశం, సింగణబోయిన సత్యనారాయణ, పగుడాల వెంకటేశం, మేకల నరేందర్,రాస సత్యనారాయణ,నల్ల భాస్కర్, గోగికార్ రాజ్ కుమార్,పుట్టల సాయికుమార్, గర్ధాస్ సాయి, గర్ధాస్ శ్రీకాంత్, రూపని బాలు తదితరులు పాల్గొన్నారు

# కామ్రేడ్ పిట్టల శ్రీను ఆశయాలను సాధిద్దాం



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 1:** కామ్రేడ్ పిట్టల శ్రీను రెండవ వర్ధంతి సందర్భంగా రామన్నపేట పట్టణ కేంద్రంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్ళు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు. పట్టణ కార్యదర్శి మునుకుంట్ల లెనిన్ మాట్లాడుతూ కామ్రేడ్ పిట్టల శ్రీను రామన్నపేట పట్టణంలో యువతి యువకులను సమీకరించి స్థానిక సమస్యలపై నిరంతరం పోరాటం చేసే వ్యక్తి. నీ కోల్పోవడం చాలా బాధకరంగా.ఉందని పిట్టల.శ్రీను కుటుంబానికి సిపిఎం పార్టీ అండగా ఉంటదని .అతనుమనకు.దూరమైన. ఆయన ఆశయాలు మన ముందు ఉన్నాయని. రామన్నపేట పట్టణంలో ఉన్న .సమస్యలు పరిష్కరించేందుకు యువతి యువకులు.ప్రజలు.ముందు వరుసలో నిలబడి పోరాటం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బావల్ల పెల్లి బాలరాజు.గాదె.నరెండర్.సినియర్ నాయకులు అముద ఆంజనేయులు మహిళా సంఘం మండల నాయకురాలు పా ల్వాశీ చ లక్ష్మి పిట్టల పద్మ.పల్లె సత్యం బావల్ల పెల్లి సత్యం. బోల్ల వెంకన్న. రాసాల.రమేష్ కడారి రాములు కుందూరు వెంకటేశ్వర్లు.పాల్వంచ.ప్రతాప్. స్నేహ లింగుస్వామి. తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మధుకర్ రెడ్డి

**- సుధాకర్ కుటుంబానికి పదివేల హార్దిక సహాయం అందజేత**



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 1:** రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం వాస్తవ్యులు కొండగడప సుధాకర్ మరణించిన విషయం తెలుసుకొని బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి 10.000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బెల్లి లింగస్వామి సింగు శంకర్ రెడ్డి రేపాక లింగస్వామి మచ్చ మహేష్ గురజాల నవీన్ రెడ్డి దాకోజు నాగరాజ్ కంచి రమేష్ వీరమల్ల నరసింహ శ్యామల గణేష్ గురజాల ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# జాతీయ గౌడ వైస్ ప్రెసిడెంట్‌గా ప్రమాణం చేస్తున్న పరిటాల



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 1:** వారణాసిలో జరిగిన కార్యక్రమంలో జాతీయ గౌడ వైస్ ప్రెసిడెంట్ గా ప్రమాణ స్వీకారం కప్పల రవికుమార్ గౌడ్ (పరిటాల) చేసినారు. అనంతరం మాట్లాడుతూ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా ఉన్న 18 కోట్ల గౌడ కులస్తులు జరుపుకో వాలని దేశవ్యాప్తంగా పాపన్న జయంతి ఉత్సవాలను ప్రభుత్వాలు అధికారికంగా జరపాలని తెలిపినారు

# మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

**జంతర్ మంతర్‌లో విద్యార్థులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే**

**విద్యార్థి నాయకులపై కక్షసాధింపు చర్యలు వెంటనే విరమించుకోవాలి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవి కుమార్**







**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 1:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ,ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవి కుమార్ విమర్శించారు.ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలతో దేశ ప్రజలపై భారాలు మోపుతూ, మరోవైపు ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోందని ఆయన అన్నారు.రామన్నపేట సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంజీ గార్డెన్‌లో నిర్వహించిన మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.దేశంలో పెరుగుతున్న మతోన్మాద రాజకీయాలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు.టీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసు దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులు తమ సమస్యలను వ్యక్తం చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని, అలాంటి ఉద్యమాలను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థి నాయకులపై కక్షసాధింపు చర్యలను వెంటనే విరమించుకోవాలని,అక్రమ కేసులను ఎత్తివేయాలని, ప్రజాస్వామ్య విలువలను కేంద్ర ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు.శిక్షణా తరగతులు ప్రారంభానికి ముందు సిపిఎం సీనియర్ కామ్రేడ్ పబ్బతి లింగయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కచం కృష్ణమూర్తి 20వ వర్ధంతి, మాజీ సిపిఎం మండల కమిటీ సభ్యుడు పిట్టల శ్రీనివాస్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. వారి ఆశయాలు, త్యాగస్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల హక్కుల సాధన కోసం మరింత కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య,మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటి సభ్యులు వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్,కందుల హనుమతు, జంపాల అండాలు,కల్లూరి నగేష్, మండల కమిటి సభ్యులు గొరిగే సోములు,గన్నేబోయిన విజయభాస్కర్, బావండ్లపల్లి బాలరాజు,గాదె నరేందర్, మీర్ ఖాజా అలీ, నాగటి ఉపేందర్, వేముల సైదులు,ఎండీ రషీద్,పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్,డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు శానాగొండ రాము, మెట్టు శ్రవణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మేడి ముకుంద, నాగటి లక్ష్మణ్,పులి బిక్షం, శానాగొండ వెంకటేశ్వర్లు, జితేందర్,కొమ్ము అంజమ్మ తదితరులు పాల్గొన్నారు

# ఖమ్మం జిల్లాను అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

**ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలి**

**పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**






**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 1:** ఖమ్మం జిల్లాలోని చెరువులు, సరస్సులు, నదీ తీర ప్రాంతాలు సహా ప్రకృతి సిద్ధమైన నీటి వనరులను ప్రజలను ఆకర్షించే పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను రాష్ట్రంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలో చేపడుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని చెరువులు, నీటి వనరుల వద్ద ప్రతిపాదించిన పర్యాటక అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాల కల్పన, అందుబాటు లో ఉన్న భూమి, వివిధ ప్రాజెక్టుల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కలకోట, చింతకాని, ముత్తారం, చిరుమర్రి, బయ్యారం, మాటూరు లేక్, వైరా, పాలేరు రిజర్వాయర్, మధిర రివర్ ఫ్రంట్, ఇనియాద్రమ్మ, జమలాపురం, మామనురు లేక్, నేలకొండపల్లి బౌద్ధ స్థూపం పర్యాటక అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే ప్రతి పర్యాటక అభివృద్ధి కార్యక్రమం నీటి వనరుల పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూమి అందుబాటులో లేకపోతే ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ పరిష్కారాలను అన్వేషించా లని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.అవసరమైతే అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన పర్యాటక సదుపాయాలు కల్పించడంలో రాజీ పడబోమని పేర్కొన్నారు. మధిర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులు ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా, నాణ్యత తో చేపట్టాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులను పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేస్తూ ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు రూపొందించా లని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, టూరిజం ఎస్ఈ సరిత, జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి, టీజీటిడీసీ, సీపీఎస్ఏ ప్రతినిధులు ఎన్. రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, స్మిత, హరికృష్ణ, ఎన్ఎస్ఎస్ సలావుద్దీన్, ఐ-క్యాడ్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# లక్ష్యాల అమలులో నిర్లక్ష్యం సహించం: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**బ్యాంకు లింకేజీ, రుణాల వసూళ్లు, మహిళా సంఘాల**

**ఆర్థిక సాధికారతపై ప్రత్యేక దృష్టి**

**సెర్ప్ కార్యక్రమాల పురోగతిపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**




**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 1:** జిల్లాలో సెర్ప్ కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేసి, స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, లక్ష్యాల అమలులో నిర్లక్ష్యం సహించమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు.శనివారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సెర్ప్ కార్యక్రమాల అమలు, వీఓ భవనాల నిర్మాణం, బ్యాంకు లింకేజీ, రుణాల వసూళ్లు, పీఎంఎఫ్ఎంఈ యూనిట్లు తదితర అంశాల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వీఓ భవనాల ప్రతిపాదనలు పంపే సమయంలో స్థల వివాదాలు లేని ప్రాంతాలనే ఎంపిక చేయాలని, వీఓ భవనాలకు స్థలాలను ప్రతిపాదించే ముందు రెండు, మూడు సార్లు క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి మాత్రమే పంపించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి నెల ఎంతమంది స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలకు అర్హులవు తున్నారో ముందస్తు ప్రణాళికతో గుర్తించి, లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా నెలవారీ లక్ష్యాలను నిర్ధారించి, బ్యాంకు లింకేజీపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.రుణాలు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి, నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) శాతాన్ని తగ్గించేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఎర్రుపాలెంతో పాటు ఇతర ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని ఎన్‌వోసీలు, అనుమతులు త్వరితగతిన పొందాలని ఆదేశించారు. ప్రతి అధికారి పూర్తి బాధ్యతతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ వీఓ భవనాల స్థల సమస్యలను పరిష్కరించేందుకు వచ్చే శుక్రవారం నాటికి ప్రత్యామ్నాయ స్థలాల ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో బ్యాంకు లింకేజీ లక్ష్యం ఇప్పటి వరకు 12 శాతం మేర సాధించామని, ఇది రాష్ట్ర సగటుతో సమానమని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్‌పీఏ 1.68 శాతంగా ఉందని, దీనిని మరింత తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ శ్రీరామ్, అడిషనల్ డిఆర్డిఓ, డీపీఎంలు, ఏపీఎంలు, సెర్ప్, డిఆర్డిఏ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీసు సేవలకు గౌరవ వందనం.. షాద్‌నగర్‌లో ఘన సన్మాన కార్యక్రమం

### బదిలీ పోలీసులకు ఘన వీడ్కోలు రిటైర్డ్ ఎస్ఐ లక్కాకుల రాజేశ్వర్‌కు ఘన సన్మానం






**తొలి అక్షరం/షాద్ నగర్,ఆగస్టు 01:** పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళు న్న పోలీసు సిబ్బందికి, పదవీ విరమణ పొందిన ఎస్ఐ లక్కాకుల రాజేశ్వర్‌కు షాద్‌నగర్‌లో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ సీతారాం, ఎస్ఐలు సుశీల, శ్రీకాంత్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని అభినందిస్తూ, బదిలీ అనంతరం కూడా అదే సేవాస్ఫూర్తితో విధులు నిర్వర్తించి శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన ఎస్ఐ లక్కాకుల రాజేశ్వర్ పోలీసు శాఖలో తన సేవా కాలమంతా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి విశిష్ట సేవలు అందించారని అధికారులు కొనియాడారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సమర్థవంతంగా పనిచేసిన ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్తున్న పోలీసు సిబ్బందికి కూడా శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. సహచర అధికారులు, సిబ్బంది వారికి ఆత్మీయంగా వీడ్కోలు పలుకుతూ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఆప్యాయ వాతావరణంలో ముగిసింది.

# షాద్‌నగర్‌లో పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులకు ప్రత్యేక కోచింగ్ ప్రారంభం






**తొలి అక్షరం/షాద్ నగర్,ఆగస్టు 01:** పోలీస్ శాఖలో ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న యువతకు శుభవార్త. షాద్‌నగర్‌లోని కాకతీయ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగాల అభ్యర్థుల కోసం ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిగి రోడ్డులోని హనుమాన్ ఆలయం పక్కన నిర్వహిస్తున్న ఈ శిక్షణలో ఫిజికల్ ట్రైనింగ్‌తో పాటు రాత పరీక్షలకు అవసరమైన సమగ్ర మార్గదర్శకత్వం అందిస్తున్నారు. దాదాపు పదేళ్ల అనుభవం కలిగిన గోల్డ్ మెడలిస్ట్ డైరెక్టర్ మచ్చేందర్ సార్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతోంది. అభ్యర్థులు ఉద్యోగం సాధించే వరకు అవసరమైన శిక్షణ, పరీక్షా ప్రణాళికలు, సందేహ నివృత్తి, ప్రాక్టీస్ సెషన్లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మచ్చేందర్ మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులు క్రమశిక్షణతో శిక్షణ పొందుతూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సరైన ప్రణాళికతో శ్రమిస్తే ఉద్యోగం సాధించడం సాధ్యమేనని అన్నారు. షాద్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలని నిర్వాహకులు కోరారు.

# విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

### - రామన్నపేట మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ

### - ముఖ్య అతిథులుగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రత్నకుమారి




**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 1:** మండల పరిధిలోని వెల్లంకి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మండల న్యాయ సేవ అధికార సంస్థ రామన్నపేట ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రత్నకుమారి హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారి సురేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో ముందు ఉండాలని, వారికి తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పని సరిగా ఉండాలని అన్నారు. విద్యా వ్యవస్థ వల్లనే ప్రపంచాన్ని మార్చే అవకాశం ఉంటదనీ, ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. అందరికీ పలు రకాల చట్టాలపై అవగాహన పొందాలని, విద్యా హక్కు చట్టం, బాలకార్మిక నిరోధక చట్టం, బాల్యవివాహాలు, ఫోక్సో చట్టం, లేబర్ చట్టాలు, మాదక ద్రవ్యాలు, అన్ని రకాలుగా ఎలాంటి సమస్య వచ్చిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లకి గాని, పెద్దలకి గాని, వృద్ధులకు గాని ఏ సమస్య ఎదురైన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లలో గానీ, మండల స్థాయిలో ఉన్న న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి గాని తీసుకురావాలని, ఎవరు కూడా అధైర్య పడవద్దని సూచించారు. చెడు దారి పట్టించే ఆలోచనలు పక్కకి నెట్టేసి, ఏమి ఆలోచనలు చేసిన మంచి నిర్ణయాలు తీసుకునే విధంగా ఉండాలని అన్నారు. సమాజం పట్ల మంచి అవగాహనతో ఉండాలన్నారు. సమాజంలో మన హక్కులు, బాధ్యతలు నిర్వహణలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఏ మజీద్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ లు మొగలయ్య, ఎన్. స్వామి, ప్యానల్ అడ్వకెట్ లు కూనూరు శ్రీనివాస్, సోమ శ్రీనివాస్ రెడ్డి, అడ్వకేట్ పాల్వంచ జగతయ్య, నరసింహ, ఏంఏ. అజీమ్, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, అగ్రీ క్లినిక్ సభ్యులు కానుగంటి శ్రీశైలం, అధ్యాపక బృందం, విద్యారులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం సందర్భంగా ఆటో ర్యాలీని ప్రారంభించిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి



**తొలిఅక్షరం/నెక్కొండ ఆగస్టు1:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోలో ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవ సందర్భంగా నవతా ఆటో యూనియన్ వారు ఏర్పాటు చేసిన ఆటో ర్యాలీ ని పచ్చ జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజీత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్,మండల అధ్యక్షులు లావుడియా తిరుమల్, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, నెక్కొండ సొసైటీ డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి కెవి సుబ్బారెడ్డి మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, జిల్లా ఎన్ఎస్ఐ అధ్యక్షుడు బోడ శ్రీకాంత్,సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, బానోత్ శ్రీకాంత్ ఆటో యూనియన్ అధ్యక్షులు మోడెం సురేష్ బద్రు మందుల కవిరాజ్, సురేష్ రాజు మోడెం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయురాలు పదవి విరమణ, అక్షర దీపం ఆరదు. సేవా సుగంధం అనంతం

### - పనికర యూపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు సుకన్య పదవీ విరమణ.



**తొలిఅక్షరం/నెక్కొండ ఆగస్టు1:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో పదవి విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమే కాదు. సేవాభావంతో వెలిగించిన ఓ దీపం మరెన్నో దీపాలను వెలిగించి తన బాధ్యతను పూర్తి చేసుకున్న మహత్తర క్షణం. పాఠశాల ఆవరణలో పిల్లల నవ్వుల్లో, బ్లాక్‌బోర్డుపై రాసిన అక్షరాల్లో, విద్యార్థుల విజయాల్లో తన జీవితాన్ని అంకితం చేసిన ఓ గురువు నిశ్శబ్దంగా తరగతి గదిని వీడే సమయం ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేస్తుంది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పనికర ఉన్నత ప్రాథమిక పాఠశాల (యూపీఎస్) ప్రధానోపాధ్యాయురాలు సుకన్య పదవీ విరమణ చేయుచున్న సందర్భంగా విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆమె విద్యాసేవలను హృదయపూర్వకంగా స్మరించుకుంటున్నారు. సుకన్య నాలుగు దశాబ్దాలుగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందించారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలు బోధించడమే కాకుండా క్రమశిక్షణ, మానవీయ విలువలు, సామాజిక బాధ్యతలను అలవర్చడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆమె బోధనలో తీర్చిదిద్దుకున్న అనేక మంది నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో సేవలందించడం ఆమె గురుత్వానికి నిదర్శనం. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందిన సుకన్య సేవలు ఉపాధ్యాయ వృత్తికి ఆదర్శంగా నిలిచాయి. విద్యను ఒక ఉద్యోగంగా కాకుండా యజ్ఞంగా భావించి, ప్రతి విద్యార్థి భవిష్యత్తును తన బాధ్యతగా తీసుకుని ముందుకు సాగిన ఆమె సేవలను ఈ ప్రాంత ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారు. పదవీ విరమణతో ఉద్యోగానికి వీడ్కోలు పలికినా, ఆమె నాటిన జ్ఞానబీజాలు తరతరాలకు ఫలాలు అందిస్తూనే ఉంటాయి. ఆమె చూపిన మార్గం యువ ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలవాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండిన పదవీ విరమణ జీవితం గడపాలని పలువురు ఆకాంక్షించారు. కవితాత్మక ముగింపు "గడియారం ఆగొచ్చు... కానీ గురువు గడియారం కాదు. పదవి ముగిసొచ్చు... కానీ సేవకు ముగింపు లేదు. తరగతి గదిని వీడినా, తరతరాల హృదయాల్లో మీ పేరు శాశ్వతం. అక్షరాలు నేర్పిన చేతులు విశ్రాంతి తీసుకున్నా, ఆ అక్షరాల వెలుగు ఎన్నటికీ మసకబారదు. "కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో పాటు పదవి విరమణ పొందుతున్న సుకన్య ఉపాధ్యాయుని కుటుంబ సభ్యులు పాఠశాల ఉపాధ్యాయులు పి అరుణ, కొమురవెల్లి వెంకటేశ్వర్లు, ఎం మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# తాటి పాముల విష్ణువర్ధన్ రెడ్డికి నివాళులర్పించిన నెక్కొండ గ్రామ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్



**తొలిఅక్షరం/నెక్కొండ ఆగస్టు1:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణానికి చెందిన తాటిపాముల అరుణ-వెంకటేశ్వర్లు దంపతుల కుమారుడు తాటిపాముల విష్ణువర్ధన్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరై వారి చిత్ర పటానికి పూలువేసి నివాళు లర్పించిన నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, సొసైటీ డైరెక్టర్ కదురు సాంబయ్య, డాక్టర్ కుడికాల కుమారస్వామి, దొనికెన రాజేందర్, డిసిసి సభ్యులు నేతుల సారంగపాణి యాదవ్, తాళ్లపల్లి భాస్కర్, కొత్తకొండ గణేష్, పొట్లపల్లి వీరస్వామి, గంద్రకోట చెన్నకేశవులు, దిలీప్, ఎస్ కే యాకూబ్, నంగునూరు భాస్కర్, యాసం కుమారస్వామి, రామగిరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# మండల తహసిల్దార్ అధ్యక్షతన భూ సర్వేపై గ్రామ పాలన అధికారులకు సూచన

### - నెక్కొండ మండల తహసీల్దారు వేముల రాజ్ కుమార్



**తొలిఅక్షరం/నెక్కొండ ఆగస్టు1:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల తాసిల్దార్ కార్యాలయం నందు మీటింగ్ ఏర్పాటు చేయడమైనది. ఇట్టి సమావేశంలోభూముల రిసర్వే యొక్క ప్రాముఖ్యత గురించి తాసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమమని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయ వంతంగా పూర్తి చేయవలసిందిగా తెలియపరిచినారు. సర్వే ప్రక్రియ యొక్క విధి విధానాల గురించి తెలియపరుస్తూ మొదటగా గ్రామాల యొక్క సరిహద్దులు నిర్ణయించడం, తదుపరి ప్రభుత్వ భూములు శిఖం లాండ్స్ మరియు గ్రామకంఠం తరువాత రైతుల భూములు కొలవటం జరుగుతుందని తెలియపరిచారు ఎస్ ఓ పి ( దశల వారి సూచనల పత్రం) గురించి తెలియపరుస్తూ పై అధికారులు ఇచ్చినటువంటి ప్రణాళిక ప్రకారం సర్వే చేపట్టాలని ఎటువంటి ఆజాగ్రత్త పనులు చేయరాదని తెలియపరిచారు. గ్రామ ల లోని రైతులకు, భూమి కలిగి ఉన్న పుర ప్రముఖులకు అవగాహన కల్పించుటలో జిపిఓల పాత్ర గురించి చాలా ప్రాముఖ్యమని రైతుల భాగస్వామంతోనే మనము రిసర్వే కార్యక్రమాన్ని సంపూర్ణంగా పూర్తి చేయగలమని కావున గ్రామ రైతులు అందరికీ ఇట్టి సర్వేపై పూర్తి అవగాహన కల్పించాలని తాసిల్దార్ రాజ్ కుమార్ తెలియపరిచినారు మండల సర్వేయర్ కె. ప్రభాకర్ నూతన సర్వే పరికరాల (, రోవర్స్ కో- ఆర్ ఎస్ ) టెక్నాలజీ పై అవగాహన కల్పించినారు పాల్గొన్నవారు. తాసిల్దార్ రాజ్ కుమార్ , మండల సర్వేర్ కె, ప్రభాకర్,గిరిద్వార్లు ఆర్ ఐ లు గ్రామపాలన అధికారులు జి పి ఓ లు మరియు లైసెన్స్ సర్వేర్ల బృందం పాల్గొన్నారు.

# తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారం తల్లి పాల వారోత్సవాల్లో అవగాహన

### మొదటి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలి: హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 01:** తల్లి పాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని, ప్రతి తల్లి తన బిడ్డకు పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలను అందించాలని హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు తెలిపారు. చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని షాద్‌నగర్ 'ఏ' సబ్‌సెంటర్ అవుట్‌రీచ్ ప్రాంతంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాధి నిరోధక కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిశువు పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు, తేనె, గ్లూకోజ్ నీరు లేదా ఇతర ఆహారాలు ఇవ్వకూడదని సూచించారు. ఆరు నెలల తర్వాత అదనపు ఆహారం ప్రారంభించినప్పటికీ రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువకాలం తల్లిపాలను కొనసాగించడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని చెప్పారు. తల్లిపాల వల్ల శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు లభించడంతో పాటు రోగనిరోధక శక్తి పెరిగి విరేచనాలు, న్యూమోనియా, చెవి ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని వివరించారు. అలాగే మెదడు ఎదుగుదల, జ్ఞాపకశక్తి, తెలివితేటలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతరం గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి చేరుకోవడం, రక్తస్రావం తగ్గడం, రొమ్ము మరియు అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గడం వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ప్రసవం తర్వాత వచ్చే పసుపు రంగు ముర్రుపాలు శిశువుకు తొలి టీకా వంటివని, వాటిని తప్పకుండా ఇవ్వాలని తల్లులకు సూచించారు. ఈ సందర్భంగా బాల అమృతం వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జయమ్మ, ఏఎన్ఎం ఇస్తేరు రాణి, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం.. జేపీసీ కరపత్రం ఆవిష్కరణ




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 01:** షాద్‌నగర్ నియోజక వర్గంలోని సిద్దాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ ఏర్పాటు చేసిన సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (ఎస్‌డీవీపీ జేఏసీ) శనివారం తన ఉద్యమ కార్యాచరణను ప్రారంభించింది. గ్రామంలో డంపింగ్ యార్డు వల్ల కలిగే పర్యావరణ, ఆరోగ్య, వ్యవసాయ నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో కరపత్రాన్ని ఆవిష్కరించింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, డంపింగ్ యార్డు ఏర్పాటు వల్ల కేవలం సిద్దాపూర్ మాత్రమే కాకుండా షాద్‌నగర్ పరిధిలోని సుమారు 50 గ్రామాలు, నాలుగు నియోజకవర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంత భవిష్యత్తుపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు ప్రతిపాదన పూర్తిగా రద్దయ్యే వరకు పార్టీలకు అతీతంగా ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని జేఏసీ స్పష్టం చేసింది. ప్రజలు ఉద్యమానికి పెద్దఎత్తున మద్దతు ఇవ్వాలని కోరుతూ, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రజల తరఫున ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కోఆర్డినేటర్ తిరుమలయ్య, సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, అబ్దుల్ రబ్ జామి, కో-చైర్మన్లు వడ్డే బాలయ్య, బిత్యా నాయక్, కో-కన్వీనర్లు ఈశ్వర్ నాయక్, బుద్ధుల జంగయ్య, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి



**తొలిఅక్షరం/నెక్కొండ ఆగస్టు1:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామ వాస్తవ్యులు జక్కి రెడ్డి కోడలు చముండేశ్వరి గతకొద్దీ రోజులక్రితం అనారోగ్యం తో మరణించగా వారి నివాసం లో జరిగిన దశదిన కార్యక్రమానికి హాజరై చిత్ర పటానికి పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, మండల అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్ మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు తాడిపత్రి నాగేంద్రమ్మ రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,సొసైటీ డైరెక్టర్ కెవి సుబ్బారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మ రెడ్డి రవీందర్ రెడ్డి, తాడిపత్రి అంజన్ రెడ్డి, మెట్టు నరసింహారెడ్డి, వజ్రాల శేఖర్ రెడ్డి వజ్రాల వెంకటరెడ్డి బత్తుల సుబ్బారెడ్డిముప్వా వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దంతాలపల్లిలో కూలిన భారీ చెట్టు... తప్పిన ప్రమాదం



**తొలి అక్షరం/ దంతాలపల్లి ఆగస్టు 01:** దంతాలపల్లి మండల కేంద్రంలో ఖమ్మం- వరంగల్ హైవే పక్కన బస్టాండ్ సమీపంలో ఉన్న మర్రిచెట్టు ఆకస్మాత్తుగా కూలిపోయింది చెట్టు కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది రద్దీ ప్రాంతంలో చెట్టు కూలడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకర చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

## స్నేహానికి నిలువెత్తు రూపం... అమరమైన మిత్రత్వానికి అక్షరాభిషేకం!



లోకం దృష్టిలో స్నేహం అంటే కేవలం జోకులు, నవ్వులు, సరదాలు మాత్రమే కావచ్చు. కానీ, ఒక మనిషి ఒంటరితనంలో ఓదార్పుగా, కష్టకాలంలో కొండంత బలంగా నిలిచే అరుదైన అనుబంధం స్నేహం ఒక్కటే! రక్తసంబంధాలు సైతం దూరం పెట్టే క్షణాల్లో, మనకోసం ప్రాణం ఇచ్చేయడానికైనా సిద్ధపడే పవిత్రమైన బంధం మిత్రత్వం. పుస్తకాల్లో చదివిన చప్పని నిర్వచనాలు కాకుండా, గుండె లోతుల నుండి ఉద్భవించిన ఈ సరికొత్త స్నేహ కావ్యాలు ప్రతి మనిషి ఆలోచింపజేసేలా... స్నేహానికి అసలైన అర్థాన్ని చెప్పేలా ఉండాలి. అక్షరాల సాక్షిగా... అపురూప స్నేహ గీతం సూర్యుడికి వెలుతురు కొత్త కాదు... సముద్రానికి అలల హోరు కొత్త కాదు... కానీ, ఈ ప్రపంచంలో ఎక్కడా లేని ఒక అద్భుతం ఏంటంటే... "నిస్వార్థమైన స్నేహం! పుట్టుకతో వచ్చే బంధాలన్నీ రక్తం పంచినవి కావచ్చు, కానీ ఎంచుకున్న క్షణాల నుండి ప్రాణం పంచేది ఒక్క స్నేహమే! ఇది ఎక్కడో చదివిన నిర్వచనం కాదు... ఇది గుండె గదిలో కొలువుండే పవిత్రమైన అనుభూతి! కష్టాల కడలిలో పడవ మునిగిపోతుంటే... ఎవరు వచ్చినా రాకపోయినా, తన రెక్కలే పడవై నిన్ను గట్టు చేర్చేవాడే అసలైన మిత్రుడు. నువ్వు గెలిస్తే నిన్ను చూసి కన్నీళ్లు పెట్టుకునే ఆనందం... నువ్వు ఓడిపోతే లోకంతో పోరాడే ధైర్యం... స్నేహం అంటే ఒక బంధం కాదు, బతకడానికి ఒక ఊపిరి! హైదర్ నగర్ గడ్డపై సాగే ఈ ప్రయాణంలోనైనా... కాలం మారుతున్న తీరుతెన్నులలోనైనా... మనసంతా నిండిన ఈ మిత్రత్వం ముందు... అన్ని బంధాలు చిన్నబోవాల్సిందే! ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఇలాంటి నిజమైన మిత్రులు ఉండాలని, మన స్నేహ బంధం కలకాలం పదిలంగా ఉండాలని కోరుకుంటూ... రాష్ట్ర ప్రజలందరికీ, మిత్రులందరికీ హృదయపూర్వక ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు!

**- ఇక్రాన్ షేక్ కంటెంటెంట్ కార్పొరేటర్, హైదర్‌నగర్**

## పి.వి. ప్రభాకర్ రావును కలిసిన టివైజెఎఫ్ ప్రతినిధులు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఆగస్టు1:** మాజీ ప్రధాని, భారతరత్న దివంగత పి.వి. నరసింహారావు తనయుడు, ఛాంబర్స్ కమిటీ చైర్మన్ పి.వి. ప్రభాకర్ రావును తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టివైజెఎఫ్) ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆయన కార్యాలయంలో శనివారం ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో టివైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ డా. జితేందర్ రావు తనుగుల, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ వెంకటేశం, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం సందర్భంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లు, యువ జర్నలిస్టుల సమస్యలు, వారి హక్కులు మరియు సంక్షేమ కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఫెడరేషన్‌ను మరింత ఐక్యంగా, బలంగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పి.వి. ప్రభాకర్ రావు జర్నలిస్టులకు పలు సూచనలు, మార్గదర్శకాలను అందించారు. ఆయన సూచనల మేరకు ఫెడరేషన్ భవిష్యత్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తామని, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని టివైజెఎఫ్ నాయకులు తెలిపారు.

## ప్రజాపోరాట యోధుడికి కళాలోకం ఆత్మీయ అభినందనం

**- సి.వై. పుల్లయ్య దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించిన కవులు, కళాకారులు**

**- ప్రజా ఉద్యమాలకు చేసిన సేవలను కొనియాడిన సాహితీ, సాంస్కృతిక ప్రముఖులు**





**తొలి అక్షరం/ఖమ్మం, ఆగస్టు 1 :** సమాజ మార్పుకోసం నిరంతరం ప్రజల మధ్య నిలిచి పోరాడే నాయకులను గౌరవించడం సమాజ సంస్కృతికి ప్రతీక. అలాంటి ఆత్మీయ దృశ్యానికి ఖమ్మం నగరం వేదికైంది. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ప్రజా నాయకుడు సి.వై. పుల్లయ్యకు కవులు, కళాకారులు, ప్రజా సాంస్కృతిక రంగ ప్రముఖులు హృదయపూర్వక సత్కారం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నా రు. ఖమ్మం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సి.వై. పుల్లయ్య, ఝాన్సీ దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించి, స్వీట్లు పంచుతూ శుభాకాంక్షలు తెలియజే శారు. విద్యార్థి ఉద్యమం నుంచి ప్రజా ఉద్యమాల వరకు ఆయన సాగించిన పోరాట ప్రస్థానం అనేక మందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన నిబద్ధత, నిరంతర ఉద్యమ స్ఫూర్తి సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, ప్రజల కోసం నిస్వార్థంగా కృషిచేసే నాయకులను గౌరవించడం సమాజ బాధ్యత అని అన్నారు. అలాంటి వ్యక్తులను కళాకారులు, కవులు సత్కరించడం ద్వారా ప్రజా ఉద్యమాలకు మరింత ప్రేరణ లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఉద్యమ స్ఫూర్తిని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సాహితీ, సాంస్కృతిక రంగం ఎప్పుడూ ముందుంటు ఒదని తెలిపారు. ప్రముఖ కవి ఐనాల సైదులు, ప్రకృతి వైద్యులు పి.సి.వి. స్వామి, జానపద యుద్ధనౌక పమ్మి రవి, ప్రజాగాయకుడు పాగి వెంకన్న, సినీ గాయకుడు అలవాల నందు, తెలంగాణ ధూంధాం గాయకులు గోవింద గురువయ్య, సినీ నటుడు మిమిక్రీ భద్ర, కోలాటం మాస్టర్ శ్రీకాంత్ కన్నా, పెద్దపాక విజయ్, వంగపండు పుల్లారావు, రాందాస్, రంజిత్, అరుణోదయ శ్రీను తదితరులు పాల్గొని పుల్లయ్య దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి " ఇంజనీరింగ్ డిగ్రీలు క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలపై భగ్గుమన్న బీజేవైఎం



**• తెలంగాణ చౌక్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం....**

**తొలి అక్షరం/కరీంనగర్ ఆగస్టు 1:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల గురించి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ లో కరీంనగర్ బీజేవైఎం జిల్లా శాఖ భారీ నిరసన కార్యక్రమం చేపట్టి, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసింది. "ఏటా 1.10 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు బయటికి వస్తున్నారు. వాళ్లను పిలిచి ఓ పేపర్ ఇచ్చి జాబ్ అప్లికేషన్ నింపమని చెప్పండి.. ఇంజనీరింగ్ డిగ్రీలు క్రిమినల్ వేస్ట్.." అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం పట్ల బీజేవైఎం కరీంనగర్ నేతలు మండిపడ్డారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు లక్షలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థులను, యువతను కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. చదువుకున్న యువత ప్రతిభను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని, వెంటనే సీఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ బీజేవైఎం శ్రేణులు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బిజేవైయం జిల్లా నాయకులు నక్క ప్రమోద్,గుర్రం వెంకటేష్ గౌడ్,చిక్కుల కిరణ్,గడ్డం అరుణ్ ,చుక్కల శ్రీకాంత్ యాదవ్,దయ్యాల రాజు,కొత్తకొండ వెంకటసాయి,ఆకుల మనోహర్, దర్శనాల మణిదీప్,బద్దం రాహుల్ రెడ్డి,బామండ్ల రాజు,ఆవుల తిరిపతి,గణేష్,గాజుల రాజ్ కుమార్ పెద్ద ఎత్తున బిజేవైయం కార్యకర్తలు పాల్గొన్నారు.



# కొరియన్ కనకరాజు ట్రైలర్ విడుదల

వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితిక నాయక్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మూవీ ట్రైలర్‌ను విడుదల చేసింది. థ్రిల్, హాస్యం, హారర్ అంశాలను మేళవించి మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. సత్య కీలక పాత్ర పోషిస్తున్న ఈమూవీకి తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు మంచి ఆదరణ పొందగా, ట్రైలర్‌లో ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా యాక్షన్, హారర్ సన్నివేశాల్లో థమన్ సంగీతం సినిమాకు అదనపు బలంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్స్, సాంకేతిక నాణ్యత సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలియజేస్తున్నాయి. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పటికే మంచి పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో కూడిన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.




# జూలో రెండు జంతువులను దత్తత తీసుకున్న అన్నా కొణిదెల



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) మరోసారి తన సేవా దృక్పథంతో ప్రశంసలు అందుకుంటున్నారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న ఆమె.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తనకున్న గౌరవాన్ని తరచూ పంచుకుంటూ అభిమానులకు మరింత చేరువవుతున్నారు.రష్యాలో జన్మించినప్పటికీ భారతీయ ఆచారాలను పాటిస్తూ పూజలు, పండుగలు, కుటుంబ వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో కనిపించే అన్నా కొణిదెలకు ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు ఆమె తీసుకున్న మరో నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. తాజాగా అన్నా కొణిదెల హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రెండు జంతువులను దత్తత తీసుకున్నారు. అందులో ఒకటి ఆసియా ఏనుగు, మరొకటి రాయల్ బెంగాల్ టైగర్. ఈ జంతువుల ఆహారం, వైద్య సంరక్షణతో పాటు ఇతర నిర్వహణ ఖర్చులను ఇకపై ఆమె భరిస్తారని సమాచారం. జూ పార్క్‌లో ఆయా జంతువుల వద్ద అన్నా కొణిదెల దత్తత తీసుకున్నట్లు ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇంతకుముందు పవన్ కళ్యాణ్ కూడా విశాఖపట్నం జూలో జిరాఫీలను దత్తత తీసుకుని జంతు సంరక్షణకు తన వంతు సహకారం అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో అన్నా కొణిదెల కూడా ముందుకు రావడం అభిమానులను ఆకట్టుకుంటోంది.

# పెళ్ళి చుట్టూ సాగే కథతో క్రేజీ కళ్యాణం

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్, నరేష్ వీకే కీలక పాత్రల్లో నటిస్తున్న ఎంటర్‌టైనర్ 'క్రేజీ కళ్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసమ్ జగన్ మోహన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్ర టీజర్ విడుదలైంది. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. సురేశ్ బొబ్బిలి ఈ సినిమాకు సంగీతం అందించారు.




# లవ్, బ్రేకప్ వార్తలపై అనుపమ పరమేశ్వరన్ స్పందన

ఇప్పుడు ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నానని వెల్లడి

ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తమిళ్ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో తన లవ్ లైఫ్, బ్రేకప్ వార్తలపై వస్తున్న ఊహాగానాలపై ఎట్టకేలకు స్పందించింది. నెట్టింట వైరల్ అవుతున్న రూమర్లకు స్వస్తి పలుకుతూ ఆమె చేసిన ఎమోషనల్ కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గత ఏడాది కాలంగా తన జీవితంలో అనేక ఒడిదుడుకులు, మానసిక సంఘర్షణలు ఎదుర్కొన్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సమయంలో అత్యంత కష్టమైన పరిస్థితులను దాటుకుని ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపింది.

"గత ఏడాది నా జీవితంలో అత్యంత సంక్లిష్టమైన, కష్టతరమైన ఘట్టం నడిచింది. ఆ కష్టాలను దాటుకుని, ఇప్పుడు మళ్లీ నా జీవితంలో సంతోషం, ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నాను" అని అనుపమ పేర్కొంది. పరిస్థితులు ఎలా ఉన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం, స్వీయ స్వేచ్ఛను ఎంచుకోవడం ఎంతో ముఖ్యమని చెబుతూ... అభిమానులు, శ్రేయోభిలాషులు అందించిన మద్దతుకు ధన్యవాదాలు తెలిపింది.



# కార్తీ 'సర్దార్ 2' టీజర్.. యాక్షన్ డోస్ నెక్స్ట్ లెవెల్!




కోలీవుడ్ హీరో కార్తీ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' (2022) చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'సర్దార్ 2' టీజర్ విడుదలైంది. యాక్షన్ ప్రియులను ఉర్రూతలూగించేలా ఉన్న ఈ టీజర్‌తో పాటు, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు.

టీజర్‌ను బట్టి చూస్తే, ఈసారి అంతర్జాతీయ కుట్రలను ఛేదించే సీక్రెట్ ఏజెంట్‌గా కార్తీ మరింత పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగంలో లాగే ఇందులో కూడా తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. హాలీవుడ్ చిత్రాలను తలపించేలా హై-స్పీడ్ ఛేజ్ సీక్వెన్సులు, భారీ యాక్షన్ బ్లాక్స్‌తో టీజర్‌ను తీర్చిదిద్దారు. దీంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.'సర్దార్' మొదటి భాగానికి దర్శకత్వం వహించిన పీఎస్ మిత్రన్ ఈ సీక్వెల్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. కార్తీ సరసన మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, రాశీ ఖన్నా, రాజీషా విజయన్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన శామ్ సీఎస్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు.ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ విడుదల తర్వాత 'సర్దార్' మొదటి భాగాన్ని మించి ఈ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా శ్రీలంక షెడ్యూల్ రద్దు!

యాక్షన్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ - మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రం షూటింగ్ కు బ్రేక్ పడింది. ఇటీవల హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా ఎన్టీఆర్ భుజానికి తీవ్ర గాయమవడంతో సినీ వర్గాల్లో, అభిమానుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అయితే, వైద్యుల సూచన మేరకు తారక్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారని, కంగారు పడాల్సిన పనిలేదని ఆయన టీమ్ భరోసా ఇచ్చింది.వైద్యులు ఎన్టీఆర్‌ను సుమారు 6 నుంచి 8 వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోమని స్పష్టం చేయడంతో, 'డ్రాగన్' చిత్రీకరణను మేకర్స్ తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలుస్తోంది. ఈ గాయం కారణంగా చిత్ర యూనిట్ ప్లాన్ చేసిన భారీ శ్రీలంక షెడ్యూల్‌ను పూర్తిగా రద్దు చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఎన్టీఆర్ కోలుకుని మళ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే.. అంటే సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ ప్రారంభంలో ఈ కొత్త షెడ్యూల్‌ను తిరిగి పట్టాలెక్కించే అవకాశాలున్నాయి.ప్లానింగ్ ప్రకారం ఈ చిత్రాన్ని 2027 జూన్ 11 ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్మాతలు పనిచేస్తున్నారు. షూటింగ్‌కు తాత్కాలిక బ్రేక్ పడినా పోస్ట్ ప్రొడక్షన్, డెడ్‌లైన్లలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు.

ప్రమాద ఘటన తర్వాత సామాజిక మాధ్యమాల్లో #GetWellSoonNTR హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. తమ అభిమాన నటుడు త్వరగా కోలుకుని, మరింత శక్తివంతంగా కెమెరా ముందుకు రావాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు

